## క్లుప్తంగా

### జగన్ ప్రభుత్వంలోనే మేలు జరిగింది



పింఛన్ ఇప్పించాలని డిమాండ్ చేస్తున్న ఆనందమ్మ

కార్వేటినగరం: జగనన్న ప్రభుత్వంలోనే తమకు సంక్షేమ పథకాలు, పింఛన్లు వచ్చాయని కలికిరిండ్లు గ్రామానికి చెందిన మహిళలు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట పంచాయతీ కలికిరిండ్లు గ్రామంలో జనసేన సభ్యత సమోదు కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ పొన్న యుగంధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ మహిళలు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు ఐదేళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరాటంకంగా పింఛన్లు పంపిణీ చేశారన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన ఆనందమ్మ మాట్లాడుతూ తనకు భర్త లేడని, కొడుకు జీవనం కోసం బయట ప్రాంతానికి ఉన్నాడని తెలిపారు. తనకు పింఛన్ ఇప్పించగలవా అని వారిని ప్రశ్నించారు. అనంతరం జనసేన నియోజకవర్గ బాధ్యులు మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు నచ్చిన వారు రూ.500 చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకుంటే జనసేన అధ్యక్షుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతుందని వివరించారు.

### పారిశుద్ధ్య పర్యవేక్షణ తప్పనిసరి

నిండ్ర : గ్రామంలో పారిశుద్ధ్య పనులను పంచాయతీ సభ్యులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శి ధరణి సూచించారు. మంగళవారం శ్రీరామాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను తప్పనిసరిగా ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని కోరా రు. ట్యాంకులను నీటితో నింపిన ప్రతిసారీ క్లోరినేషన్ చేయించి గ్రామస్తులకు సరఫరా చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెల్లడించారు.

### ఆలపాకంలో పారిశుద్ధ్య పనులు

విజయపురం : మండలంలోని ఆలపాకం పంచాయతీలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బాబు పర్యవేక్షణలో రోడ్డుపై నిలిచిన బురదను తొలగించి, తెల్లగ్రావెల్ వేశారు. చెత్తాచెదారాలతోపాటు పేడ దిబ్బలను తొలగించారు. మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రం పరిచారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి కానికరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వీధుల్లోకి మురుగు నీటిని వదలకూడదని సూచించారు.

### గంబూసియా చేపల విడుదల

నిండ్ర : మండలంలోని ఎలకాటూరు గ్రామంలో మంగళవారం చిత్తూరు సబ్ యూనిట్ అధికారులు నీటి గుంతల్లో గంబూసియా చేపపిల్లలను వదిలిపెట్టారు. వారు మాట్లాడుతూ ఈ చేపలు నీటిలోని దోమల లార్వాను తినేస్తాయన్నారు. దీంతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. గ్రామీణులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శివమణి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

శ్రీరంగరాజపురం : మండలవ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ గిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట విద్యుత్‌కేంద్రం వద్ద 132 కేవీ మరమ్మతులు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. అలాగే తీగలకు అడ్డంగా ఉన్న ముళ్ల కంపలను తొలగించడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

### ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు


పుత్తూరు: నారాయణవనం మండలం ఇప్పతాంగేలి గ్రామం వద్ద నూతనంగా ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని కళాశాల చైర్మన్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సీఎస్ఈ, ఏఐడీఎస్, ఈసీఈ, ఈఈఈ సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

### కమనీయం.. ద్రౌపదీదేవి కల్యాణం

వెదురుకుప్పం: పండితుల వేదమంత్రోశ్చరణలు.. మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ ద్రౌపదీదేవి అమ్మవారి కల్యాణం కనుల పండువగా సాగింది. మండలంలోని పచ్చికాపల్లం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి భారతి హరికథా కాలక్షేపం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ చేశారు. అమ్మవారిని పుష్పపల్లకిపై ఉంచి ఊరేగించారు. రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ నాటకం రక్తి కట్టించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



నగరి వ్యూ ఫొటో



# సారూ.. మా గోడు వినిపించండి

- అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలపై మాట్లాడాలి
- నగరి, జీడీనెల్లూరుకు ఎమ్మెల్యేలు లబ్ధి చేకూర్చాలంటూ వేడుకోలు

నగరి/కార్వేటినగరం: 'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తరపున ప్రతినిధిగా ఎన్నుకున్నాం. మా సమస్యల పరిష్కారానికి, మాకు కావాల్సిన అభివృద్ధి పనులు చేకూర్చడానికి ఎమ్మెల్యే అసెంబ్లీలో గొంతు విప్పుతారు' అంటూ నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడుతాయని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే భానుప్రకాష్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు నగరికి విచ్చేసిన సమయంలోనే ప్రజలతో కలసి ఆ పార్టీ నాయకులు రైల్వే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పలు ట్రైన్లను నగరిలో ఆపించాలని, ఏకాంబరకుప్పం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వారి కోరికను ప్రజా ప్రతినిధుల ముందు ఉంచారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో ఎన్నికల హామీలతోపాటు, నియోజకవర్గానికి మేలు చేకూర్చే పలు పనులకు శ్రీకారం చుడుతారని నమ్ముతూ సారూ.. ఇదిగో మా అజెండా అంటూ ప్రజలు ఇలా తెలియజేస్తున్నారు.

**మరమగ్గ కార్మికుల పెన్షన్...**

ఇదివరలో 1000 చదరపు అడుగుల ఇల్లు ఉన్నవారికి మాత్రమే పెన్షన్ అందించేవారు. అయితే మరమగ్గ కార్మికులకు వృత్తిరీత్యా 3000 చదరపు అడుగుల వరకు ఇల్లు ఉంటుంది. ఈ కారణంగా వారికి పెన్షన్ అందదు. ఈ నిబంధనలో సడలింపు తీసుకువచ్చి మరమగ్గ కార్మికులకు పెన్షన్ అందించాలని కోరుతున్నారు.

**500 యూనిట్ల ఉచిత విద్యుత్**

ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తానని అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని పొందుపరిచారు. ఆ ఉచిత విద్యుత్ అంశాన్ని ప్రస్తావించి హామీ నెరవేర్చాల్సి ఉంది.

**టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు**

నగరికి టెక్స్‌టైల్ పార్కు తీసుకువస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుత ఎమ్మెల్యే కోరిక మేరకు ఎన్నికల సమయంలో ప్రకటించారు. ఆ హామీని నెరవేరుస్తూ టెక్స్‌టైల్ పార్కును నగరికి మంజూరు చేయించుకురావాలి.

**గాలేరు–నగరి పథకంలో చలనం**

తమ పాలనలో ప్రారంభించిన గాలేరు–నగరి పథకాన్ని పూర్తి చేయలేకపోయారని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. పడకేసిన గాలేరు–నగరి పనులను వేగవంతం చేసి, పూర్తి చేయాల్సి ఉంది.

**మరమగ్గ కార్మికులకు ప్రభుత్వ ఆర్డర్లు**

మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు, వైద్యశాలలకు సంబంధిత దుస్తుల ఆర్డర్లను ఇతర రాష్ట్రాల వారికి అందిస్తున్నారు. వాటిని మన రాష్ట్రంలోని మరమగ్గ కార్మికులకు అందించి పని కల్పించాల్సి ఉంది. అంతే కాకుండా సబ్సిడీపై మరమగ్గాలను అందించాలి.

**ఏఐబీ పథకం తాగునీటి ప్రాజెక్టు**

పుత్తూరు ప్రజలకు పుష్కలంగా నీరు అందించడానికి ఏఐబీ పథకం ప్రారంభించి 30 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా పూర్తి చేసి పుత్తూరుకు పుష్కలంగా తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలి.

**ఇసుకను స్థానికంగానే అందించాలి**

నగరిలో స్టాక్ పాయింట్ పెట్టకపోవడంతో సత్యవేడు నియోజకవర్గం సుబ్బానాయుడు కండ్రిగ నుంచి ఇసుక తీసుకురావాల్సి ఉంది. దీంతో ట్రాక్టరు ఇసుక రూ.3500 నుంచి రూ.4 వేలు అవుతోంది. నగరిలోనే స్టాక్ పాయింట్ పెడితే సీనరేజి చార్జి, ఇసుక ఎత్తివేసుకునే చార్జీ, ట్రాక్టర్ బాడుగ అంటూ రూ.2 వేలకే ఇసుక లభించే అకాశం ఉంటుంది. కనుక నగరిలోనే ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

### జీడీనెల్లూరును అభివృద్ధి చేయండి

నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో ప్రజల తరఫున గళం విప్పి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారని నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నారు. అదే విధంగా అధికారం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి మార్గదర్శకాలు ఏవైనా వెలువడతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సమస్య మీది.. పరిష్కారం మాది అనే కార్యక్రమం నిర్వహించారు. అందులో ఎక్కువగా గ్రామాల్లో భూతగాదాలు, రోడ్డు సమస్యలపై వినతులు అందాయి. వాటి పరిష్కారం కోసం అసెంబ్లీలో సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గాన్ని పారిశ్రామిక కారిడార్‌గా మార్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తానని, ప్రతి గ్రామానికి మినరల్ వాటర్‌ప్లాంట్, రోడ్ల ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలపై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికల హామీలతో పాటు నియోజకవర్గంలో మేలు చేకూర్చేందుకు శ్రీకారం చుడతారని ప్రజలు ఆశిస్తున్నారు.



జీడీ నెల్లూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు

**ఇవీ సమస్యలు.. పరిష్కరించండి..**

- ఉడమల కృత్తి వద్ద అర్ధాంతరంగా నిలిచిన ఓవర్ బ్రిడ్జి పనులను పునఃప్రారంభించాలి
- పెనుమూరు, కార్వేటినగరం మండలాల్లో నిర్మాణంలో ఉంటున్న 50 పడకల ఆస్పత్రిని వేగవంతం చేయాలి
- నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి
- గ్రామాల్లో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలి
- అలాగే పెండింగ్‌లో ఉన్న రోడ్లను నిర్మించాలి
- కృష్ణాపురం జలాశయ సప్లై చానళ్లకు మరమ్మతులు చేసి ఆయకట్టులోని ప్రతి రైతుకు నీరు అందించాలి
- గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు నిధులు విడుదలయ్యేలా చూడాలి

### చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి

పొలసముద్రం : గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం, చెత్త సేకరణ కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి, వానపాములు వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకే కేజీల ప్రకారం విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు రాజీవ్ కుమార్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

### తలనీలాల వేలం రేపు

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని తలనీలాల వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆలయ దేవదాయ ఈఓ కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే ఆడికృత్తిక వేడుకల్లో భక్తులు సమర్పించే తలనీలాల కోసం ఈ నెల 25వ తేదీ 11 గంటలకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.20 వేలు దరావత్తు చెల్లించాలని సూచించారు.

### పుట్టగొడుగుల పెంపకంపై కోర్సు

నగరి : పుట్టగొడుగుల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించినట్లు నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీజెడ్‌సీ మూడో సంవత్సరం విద్యార్థుల కోసం పుట్టగొడుగుల పెంపకం ప్రారంభించామన్నారు. విద్యార్థులకు విలువైన హ్యాండ్-ఆన్ అనుభవంతోపాటు శిలీంధ్రాలు గురించి తరగతి గది పరిజ్ఞానాన్ని అమలు పరిచేందుకు వీలు కల్పిస్తుందన్నారు. పండించిన పుట్టగొడుగులను కళాశాల ఫ్యాకల్టీకి అమ్ముతున్నట్లు వెల్లడించారు. జువాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలను పొందేలా చేయడంలో ఈ కోర్సు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విజయవంతంగా పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన పరిజ్ఞానం, మెలకువలను విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సును ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.స్వాతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

## సమయపాలన పాటించకుంటే చర్యలు

విజయపురం : సమయపాలన పాటించకుంటే సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ బ్రహ్మయ్య హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సకాలంలో విధులకు హాజరుకావాలని, రోజుకు మూడుసార్లు బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేయాలని, లేకుంటే వేతనం కట్ చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో 15 రోజులకు ఒక సారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని, ప్రతి రోజూ క్లోరినేషన్ తప్పనిసరని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా పేడదిబ్బలను తొలగించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మలాథియాన్ మందు పిచికారీ చేయాలని, తప్పనిసరిగా ఫాగింగ్ చేయించాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వాటర్ టెస్ట్ చేసి రిపోర్ట్ అందించాలని ఆదేశించారు.

### ధర్నా విజయవంతం కావాలని పూజలు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మకు మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు విజయబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నా విజయవంతం కావాలని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలో వచ్చిన రోజు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, హత్యలు, ఆస్తి నష్టం, హత్యాచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దారుణాలన్నీ కేంద్రానికి, దేశ ప్రజలకు తెలియజేయడానికే జగనన్న ఢిల్లీలో ధర్నా తలపెట్టారని, అది విజయవంతం కావాలని అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నట్లు చెప్పారు. అలాగే బెంగళూరు నుంచి భక్తులు ప్రత్యేక బస్సులో వచ్చి అమ్మవారికి అంబలి, పిండివంటలు, నైవేద్యంగా సమర్పించారు. మొక్కుబడిదారులు గంగమ్మ వేషధారణల్లో మొక్కులు తీర్చుకున్నారు. తొలుత డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

### పంపిణీకి సిద్ధంగా చెత్తకుండీలు


విజయపురం : మండలంలో పంపిణీ చేసేందుకు చెత్త కుండీలను సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ద్వారా చెత్తకుండీలు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ ఇంటిలోని చెత్తను బయటపడేయకుండా కుండీలో వేయాలన్నారు. ఈ క్రమంలోనే పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు వారికి చెత్త అందించి సహకరించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

### 27న మండల మీట్

వెదురుకుప్పం: ఈనెల 27న శనివారం ఉదయం 10.30 గంటలకు వెదురుకుప్పంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### ప్రజారోగ్య రక్షణకే వైద్యశిబిరాలు

పుత్తూరు: ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా రాస్ సంస్థ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని శంకర్ నేత్రాలయ అధికారి వెంకటముని తెలిపారు. మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్), చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వారు పుత్తూరు పట్టణ పరిధిలోని రాచపాళెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటముని మాట్లాడుతూ పొదుపు సంఘ సభ్యుల కోసం రాస్ సంస్థ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తూ, మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నారని వెల్లడించారు. వైద్య శిబిరంలో 170 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 36 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి చెన్నైలోని శంకర్ నేత్రాలయ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్‌రాజు, రాచపాళెం పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి, రాస్ అధికారులు రవి, ప్రకాష్, దాక్షాయణి, రమేష్‌బాబు, రజని, హరి, మునివేలు, లక్ష్మీ, ఉమ, గోవిందమ్మ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

### వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పొలసముద్రం : వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం పాలు కాకుండా ఉంటారని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు హెచ్‌ఎం శ్యామలమ్మ, ఎంఎల్‌హెచ్‌ఓ సునీత సమీక్షంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. డైటింగ్ పేరుతో చాలామంది విద్యార్థులకు అతి తక్కువగా తింటూ బలహీనతకు గురవుతుంటారని, అటువంటి వారు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కచ్చితంగా ఐరన్ టాబ్లెట్లు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రేవతి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.